విద్యుత్తు ఇంజినీర్లు కష్టపడి పనిచేయండి

- ముఖ్యమంత్రి రేవంత్ సూచన
- సీఎంను కలిసిన టీఎస్‌పీఈఏ ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో ఇంజినీర్ల పాత్ర చాలా ముఖ్యమని, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సీఎం అసోసియేషన్ బాధ్యులతో మాట్లాడారు. ఇంజినీర్లు కష్టపడి పనిచేసి సంస్థల నష్టాలను తగ్గించాలని సూచించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. విద్యుత్తు సంస్థల్లో సమస్యల పరిష్కారంపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీఎస్‌పీఈఏ అధ్యక్ష కార్యదర్శులు పీ రత్నాకర్‌రావు, పీ సదానందం, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ జనప్రియ, టెక్నికల్ సెక్రటరీ గోపాలకృష్ణ, విద్యుత్తు సౌధ బ్రాంచ్ సెక్రటరీ మల్లయ్య ఉన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యవర్గ భేటీ

- హాజరుకానున్న ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్
- పార్లమెంట్ ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చ

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధమవుతున్నది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు గాంధీభవన్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీతోపాటు ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు, పీఏసీ, పీఈసీ సభ్యులు, మంత్రులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నిర్వహిస్తున్న తొలి కార్యవర్గ సమావేశం ఇదే. ఇందులో ఎంపీ అభ్యర్థుల ఎంపిక, లోక్‌సభ ఎన్నికల వ్యూహరచనతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చించనున్నారు.

రాష్ట్రానికి నిధుల కేటాయింపు పెంచండి

- నీతి ఆయోగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి
- సీఎంతో సంస్థ వైస్ చైర్మన్ సుమన్‌కుమార్ భేటీ



మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అయిన నీతి ఆయోగ్ బాధ్యులు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి 16వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చే నిధుల కేటాయింపు పెంచాలని నీతి అయోగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మంగళవారం నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్‌కుమార్ బేరి బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా సహకార సమైక్యవాదం గురించి సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రాభివృద్ధి, కీలక రంగాలకు సంబంధించి ప్రాధాన్యతలు, రాష్ట్ర అవసరాలను నీతి ఆయోగ్ అధికారులకు రేవంత్‌రెడ్డి వివరించారు. కేంద్రం నుంచి అందాల్సిన న్యాయమైన కేటాయింపులు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రాష్ట్రానికిచ్చే నిధులు, వనరుల మంజూరుపై చర్చించారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా నిధుల కేటాయింపు పెంచాలని, ఆరోగ్యం, విద్యలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విభజన చట్టం ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.1800 కోట్లు విడుదల చేయాలని కోరారు. సబర్మతి రివర్ ఫ్రంట్, నమామి గంగే తరహాలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పీపీపీ మాడల్‌లో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సాంకేతిక సహకారం అందించాలని విన్నవించారు. హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం సహకారాన్ని కోరారు. వీటిపై నీతి ఆయోగ్ అధికారులు స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు కలిసి పనిచేయడానికి అంగీకరించారు. రాష్ట్ర అభివృద్ధికి తమవంతుగా సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. నీతి ఆయోగ్ పాలక మండలిలో రాష్ట్ర భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్ర సామర్థ్యాలను పటిష్టం చేయడానికి 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్' (ఎస్ఐటీ)ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులు విజయకుమార్, డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్, డైరెక్టర్ అభినేశ్ డాష్, ముత్తుకుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీగా బలరాం

- అడ్మినిస్ట్రేషన్‌కు శ్రీధర్ బదిలీ
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- ముఖ్యమంత్రి, మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎండీ బలరాం

హైదరాబాద్/భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 2 (నమస్తే తెలంగాణ): సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఎన్ బలరాం నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత సీఎండీ ఎన్ శ్రీధర్ పదవీకాలం పూర్తి కావడంతో జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బదిలీ చేశారు. ఐఆర్ఎస్ అధికారి అయిన బలరాం ఇప్పటి వరకు సింగరేణిలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన సీఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించిన బలరాం అనంతరం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ విద్యుత్తు కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలని బలరాంను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా 1200 మెగావాట్ల విద్యుత్తును నిరంతరాయంగా అందిస్తామని తెలిపారు. సంక్షేమంలోనూ సింగరేణిని నంబర్ వన్ చేస్తానని చెప్పారు. ఒడిశాలోని నైనీబ్లాక్ నుంచి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు.

సింగరేణి అభివృద్ధిలో శ్రీధర్ కీలక పాత్ర

1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్ శ్రీధర్ 2015 జనవరి 1న సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి, కార్మికులకు మధ్య సంధానకర్తలా వ్యవహరించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో రూ.11,928 కోట్లుగా ఉన్న సింగరేణి టర్నోవర్ 2022-23 నాటికి రూ.32,500 కోట్లకుపైగా పెరగడంలో కీలక పాత్ర పోషించారు.

మూసీ అభివృద్ధి మూడేండ్లలో..

- తొలిదశలో 55 కిలోమీటర్ల మేర అభివృద్ధికి ప్రణాళిక
- హెచ్‌ఎండీఏ అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ): నగరంలోని మూసీ నది పరివాహక ప్రాంతం అభివృద్ధికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం నానక్‌రాంగూడలోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్, హెచ్‌ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ అమ్రపాలి, సీఎం ఓఎస్డీ అజిత్‌రెడ్డితోపాటు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ మూసీనది పరివాహక ప్రాంతాన్ని రాబోయే 36 నెలల్లో అభివృద్ధి చేయాలని సూచించారు. అందులో భాగంగా తొలుత హైదరాబాద్ నగరం పరిధిలోని 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. అన్ని వర్గాల ప్రజలకు అనువైన ఐకానిక్ డిజైన్ ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. అమ్యూజ్‌మెంట్ పార్కు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్స్ వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్స్, బిజినెస్ ఏరియా, షాపింగ్‌మాల్స్ ఇలా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ ఉండాలని చెప్పారు. ఇందుకోసం విదేశాలతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నదీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టుల డిజైన్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. 3 నెలల్లోలోగా సంబంధిత పనులు ప్రారంభించేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆకస్మిక వరదలు వచ్చినా తట్టుకొనే విధంగా వర్షపు నీటిని మూసీలోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూసీనది పరివాహక అభివృద్ధికి భవిష్యత్తులో ఎలాంటి అడ్డంకులు రాకుండా ముందు జాగ్రత్తగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న చారిత్రక కట్టడాలైన చార్మినార్, తారామతి బరాదరి, ఇతర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్ డిజైన్ రూపొందించాలని అన్నారు. పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

- వైఎస్సార్ ఘాట్ వద్ద షర్మిల నివాళులు
- నేడు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో సమావేశం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ఇడుపుల పాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. కుమారుడు రాజారెడ్డి, కాబోయే కోడలు ప్రియ, కుటుంబ సభ్యులతో ప్రత్యేక విమానంలో ఆమె ఇడుపులపాయ వెళ్లారు. కుమారుడి పెండ్లి పత్రికను ఘాట్ వద్ద ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధమని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని, తమ త్యాగాలకు విలువ ఇచ్చిన పార్టీలో చేరాలని కోరిందని, అందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. దేశంలో అందరికీ భద్రతనిచ్చే అది పెద్ద సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు బుధవారం ఢిల్లీ వెళ్లనున్నట్టు తెలిపారు. ఈ నెల 4న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీ సమక్షంలో షర్మిల పార్టీలో చేరే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

సింగరేణిని న్యాయ విచారణ పరిధిలో చేర్చాలి

- సీఎం రేవంత్‌తో భేటీలో సీపీఐ నేతలు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్‌లో జరిగిన అక్రమాలు, అవినీతిని న్యాయ విచారణ పరిధిలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కే నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, టీ శ్రీనివాసరావు తదితరులతో కూడిన బృందం మంగళవారం సచివాలయంలో సీఎంతో భేటీ అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలకు సమర్థులైన అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కల్పించుకున్న సీఎం ఇదే విషయాన్ని విద్యుత్తుశాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాలని వారికి సూచించారు.

'స్థానిక' బీసీ రిజర్వేషన్లు 42%కు పెంచాలి

- ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి
- సీఎం రేవంత్‌కు ఎంపీ కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 22 నుంచి 42 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బీసీ సీఎం ప్రకటన చేసినా బీసీలు కాంగ్రెస్ వైపే ఉన్నారని గుర్తుచేశారు. ముందుగా బీసీ కులగణన చేయాలని 2010 కర్ణాటక కేసులో, 2019 మధ్యప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందన్నారు.

బీసీలు, ఎంబీసీలకు ప్రత్యేక బడ్జెట్ కావాలి

బీసీ, ఎంబీసీ, సంచారజాతుల సంక్షేమానికి 2024-25 బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. బీసీ కులాలకు పాలకవర్గాలను నియమించాలని లేఖలో పేర్కొన్నారు. వెనుకబడిన కులాల సంక్షేమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లపై ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

స్త్రీనిధి పెండింగ్ రుణాలు ఇవ్వండి

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): స్త్రీనిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల రుణాలను వెంటనే పంపిణీ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ-శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఎక్కువ రుణాలు ఇచ్చేలా చొరవ చూపాలని సూచించారు. స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ పనితీరుపై మంగళవారం ఆమె సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. రహదారుల వెంట పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించే చిరు వ్యాపారులకు షెడ్డులు ఏర్పాటు చేయాలని, స్థానిక ఉత్పత్తులకు డిమాండ్ పెరిగే విధంగా చొరవ చూపాలని సూచించారు. గిరిజన ప్రాంతాల అవసరాలు గుర్తించేందుకు స్టడీ టూర్ నిర్వహించాలని, మహిళలంతా స్వయం సహాయక సంఘాల్లో చేరేలా చూడాలని సూచించారు.

ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు

- ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ముందుకే..
- దరఖాస్తుల ఆధారంగా అర్హులకు పథకాలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జనవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి రోజే ప్రజలకు ఇచ్చిన హామీల్లో ముందుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించగా, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను క్యాబినెట్ ఆమోదించి వాటికి చట్టబద్ధత కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. వాటి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎన్ని అడ్డుంకులు వచ్చినా 24 గంటల కరెంట్ ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హులందరికీ పథకాలను అందేలా చూస్తామని అన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు కూడా పరిష్కరిస్తామని చెప్పారు. ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకూ స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆశించిన స్థాయిలో పాలన అందించి అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తామని తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ మనుగడ కష్టమే

- బీజేపీ ఎంపీ బండి సంజయ్

విద్యానగర్ (కరీంనగర్), జనవరి 2: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడ కష్టమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగా లేదని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన బీజేపీ మండల అధ్యక్షులు, కొత్తగా ఎంపికైన మండల ఇన్‌చార్జీల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు.

13 నుంచి కైట్ ఫెస్టివల్

- మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఈ నెల 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్టు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బేగంపేటలోని హరిత ప్లాజాలో మంగళవారం ఆయన పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా తెలంగాణ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చే యాలని అధికారులకు సూచించారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని సూచించారు. టూరిజం ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని, హరిత హో టళ్లను ప్రైవేట్ హోటళ్లకు దీటుగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు.

కైట్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

అంతర్జాతీయ పతంగుల పండుగకు హైదరాబాద్ సిద్ధమవుతున్నది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు హరితప్లాజాలో ఆవిష్కరించారు. ఈ పండుగలో 16 దేశాలకు చెందిన 40 మంది ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్స్, 60 దేశవాళీ కైట్ క్లబ్బులకు చెందిన సభ్యులు పాల్గొంటారు.

'ప్రజాపాలన'లో సందేహాలెన్నో..

- రైతుబంధు రైతులకా? కౌలు రైతులకా?
- ఎవరు దరఖాస్తు చేసుకోవాలో తెలియక రైతుల సతమతం
- సిబ్బంది కొరత.. దరఖాస్తు ఫారాలు లేక జనం అవస్థ

నమస్తేతెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో పలు పథకాలకు దరఖాస్తు చేసుకునే విధానంపై స్పష్టత లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబంధు విధివిధానాలు తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుబంధు రైతులకా? కౌలు రైతులకా? అని పలువురు రైతులు మంగళవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో రైతులు ఆర్ బుచ్చిరెడ్డి, నంబూరి మధు తదితరులు తమ సందేహాలను అధికారుల ముందు వ్యక్తంచేశారు. కాగా మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో సిబ్బంది కొరత, దరఖాస్తు ఫారాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 24 కౌంటర్లకు గాను 17 మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిలో కూడా సిబ్బంది కొరత కారణంగా 4 కౌంటర్లను ఖాళీగా వదిలేశారు. సిబ్బంది కొరత ఉన్నదని, దరఖాస్తు ఫారాలు వచ్చిన కాడికి ఇచ్చామని తహసీల్దార్ తోట సూర్యనారాయణ తెలిపారు.

ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై నిలదీత

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో ప్రోటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకోగా.. బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. కమ్మర్‌పల్లిలో గ్రామసభ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫొటో లేకపోవడంతో ఎంపీటీసీ మైలారం సుధాకర్, బీఆర్ఎస్ నాయకుడు లోలపు సుమన్, గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఫొటోలు ఏర్పాటుచేయాలని, ఆ తరువాతే సభ నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో దిగివచ్చిన అధికారులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాతో రావడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

నాలుగోరోజు 20.39 లక్షల దరఖాస్తులు

ప్రజాపాలనలో భాగంగా మంగళవారం నిర్వహించిన అభయహస్తం కార్యక్రమం కింద 20.39 లక్షల దరఖాస్తులను స్వీకరించినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ప్రజాపాలన నిర్వహణపై కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. నాలుగో రోజైన మంగళవారం మొత్తం 20,39,927 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో అభయహస్తం గ్యారెంటీలకు సంబంధించి 17,39,146 దరఖాస్తులు రాగా, ఇతర అంశాలకు సంబంధించి 3,00,817 వచ్చాయని సీఎస్ వెల్లడించారు. ఇప్పటివరకు 61,16,167 దరఖాస్తులు అందినట్టు ఆమె పేర్కొన్నారు. మంగళవారం 1,866 మున్సిపల్ వార్డులు, 3,779 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు.

హామీలను అమలు చేసి తీరుతం

- దరఖాస్తులు విక్రయిస్తే కఠిన చర్యలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ)/మెహిదీపట్నం: ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ గ్రేటర్ పరిధిలోని మెహిదీపట్నం సర్కిల్ విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఇప్పటివరకు కంటోన్మెంట్‌తో పాటు నగరవ్యాప్తంగా 650 కేంద్రాలను ఏర్పాటు చేసి 9.92 లక్షల దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు సమర్థంగా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. దరఖాస్తులను ఉచితంగానే అందిస్తున్నామని, ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జోనల్ కమిషనర్ వెంకటేశ్ దొత్రే తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి.. కామన్‌సెన్స్ ఉన్నదా?

- బరాజ్ కుంగితే ఎందుకు సందర్శించలేదు?
- కాంగ్రెస్‌పై బురదజల్లే యత్నం
- కాళేశ్వరంపై ఈ వారంలో జ్యుడీషియల్ విచారణ
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డపై మాట్లాడేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కొంచెమైనా కామన్‌సెన్స్ ఉండాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్ర సంస్థలు రుణాలిచ్చిన మేడిగడ్డ కుంగిపోతే కేంద్ర మంత్రిగా ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని కిషన్‌రెడ్డి చేసిన సవాల్‌కు ఉత్తమ్ మంగళవారం కౌంటర్ ఇచ్చారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కిషన్‌రెడ్డి కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ పదేండ్లపాటు కలిస